# కాంగ్రెస్‌కు ఓటేస్తే కరెంట్ కష్టాలు



ప్రజాప్రతినిధులకు పార్టీ కండువా కప్పి పార్టీలోకీ ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి చంటి క్రాంతి కిరణ్, మామిడి సుధాకర్ రెడ్డి



మాచరంలోని చేరికల సమావేశానికి హాజరైన, నాయకులు కార్యకర్తలు

- బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు
- ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి హరీశ్‌రావు
- మంత్రి సమీక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన మామిడి సుధాకర్ రెడ్డి
- 1000మంది నాయకులు, కార్యకర్తలు



మామిడి సుధాకర్‌రెడ్డికి గూలాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి హరీశ్‌రావు, అందోల్ బీఆర్ఎస్ అభ్యర్థి చంటి క్రాంతి కిరణ్

మెదక్ రూరల్, నవంబర్ 15: కాంగ్రెస్‌కు ఓటేస్తే కరెంట్ కష్టాలు మొదలవుతాయని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. టేక్మాల్ మండలంలోని ఎల్లుపేట గ్రామానికి చెందిన మామిడి సుధాకర్‌రెడ్డి బుధవారం మంత్రి హరీశ్‌రావు సమక్షంలో మాచవరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆయన వెంట మండలానికి చెందిన ఆయన మద్దతుదారులు భారీగా సుమారు 1000 మంది కాంగ్రెస్, బీజేపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మామిడి సుధాకర్‌రెడ్డికి, ప్రజాప్రతినిధులు, నాయకులకు మంత్రి హరీశ్‌రావు, అందోల్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చంటి క్రాంతి కిరణ్‌తో కలిసి పార్టీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పథకాలకు ప్రతిపక్షాల నాయకులు, కార్యకర్తలు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరుతున్నారని అన్నారు. సీఎం కేసీఆర్ ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని గొప్ప మ్యానిఫెస్టోను రూపొందించారన్నారు. వృద్ధులు, వితంతులకు ఆసరా పింఛన్ రూ. 5016కు పెంచుతారని అన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ఆడపిల్లలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్, రైతులకు రైతు బంధు, రైతు బీమా, వ్యవసాయానికి 24 గంటల కరెంట్ తదితర కార్యక్రమాలు, దళితుల కోసం దళిత బంధు లాంటి వినూత్న పథకాలు చేపట్టి దేశానికే తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలిపారన్నారు. అనంతరం ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ మాట్లాడుతూ ఎల్లుపేట గ్రామ పరిధిలోని తండాలు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఆయన చేసిన సేవా కార్యక్రమాలు, ఆయన పేరును మరువలేనివిగా చేశాయన్నారు. సుధాకర్ రెడ్డి చేరికతో పార్టీ బలోపేతమయ్యిందన్నారు. ప్రజలకు సంక్షేమ ఫలాలు మరింత అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తే అసైన్‌మెంట్ భూముల నిబంధనలను సులభతరం చేస్తామన్నారు. తండాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలన్న లక్ష్యంతో తండాలను గ్రామ పంచాయతీలుగా చేశామన్నారు. అందోల్ నియోజకవర్గంలో ప్రతి తండాకు రూ.40 లక్షలు నుంచి కోటి రూపాయల వరకు ఖర్చు చేసి తండాల అభివృద్ధికి కృషి చేశామన్నారు. 30 ఏండ్లుగా ఏ ప్రభుత్వం తండాలకు ఇన్ని నిధులు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. అనంతరం మామిడి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు తమను ఎంతోగానో ఆకర్షించాయన్నారు. అందరం కష్టపడి అందోల్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్‌ను గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. ఐదేండ్లు మనకు సంక్షేమ పథకాలు అందుతాయని, నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామని అన్నారు. కార్యక్రమంలో స్టేట్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ భిక్షపతి, ఉమ్మడి మెదక్ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ బాలయ్య, పార్టీ మండల అధ్యక్షుడు భక్తుల వీరప్ప, ప్రధాన కార్యదర్శి అవినాశ్, బీఆర్ఎస్ జిల్లా యువత అధ్యక్షుడు భాస్కర్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా

## సోషల్, ప్రింట్ మీడియా ప్రచారంపై నిఘా పెట్టాలి

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు రాజర్షి షా**

మెదక్, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ): సాధారణ ఎన్నికల నియమావళి అమలులో భాగంగా సోషల్, ప్రింట్ మీడియాలో ప్రచారంపై నిఘా పెట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో అధికారులతో సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కెమెరాలు ఏర్పాట్లు పరిశీలించాలన్నారు. ఎంసీఎంసీ మీడియా సెంటర్‌లో ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ టీం వాహనాల మానిటరింగ్ చేయాలని ఎంపీఎంసీ మీడియా సెంటర్ సిబ్బంది, పెయిడ్ న్యూస్, టీవీ న్యూస్, టీవీ కార్యక్రమం రికార్డింగ్, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రచారంపై నిఘా పెట్టాలన్నారు. ఎంసీఎంసీ మీడియా సెంటర్‌లో సీ –విజిల్ సిబ్బంది, సోషల్ మీడియా సిబ్బంది, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ టీంల టీవీ మానిటరింగ్ సిబ్బందిని విధుల్లో అప్రమత్తం చేయాలని నోడల్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రమేశ్, వెంకటేశ్వర్లు, జడ్పీ సీఈవో శైలేశ్, నోడల్ అధికారులు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి గోవింద్, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి కృష్ణయ్య, ఈడీఎమ్ సందీప్, డీపీఆర్ఓ ఏడు కొండలు ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ

- మెదక్ బరిలో 13 మంది
- నర్సాపూర్ బరిలో 11 మంది

మెదక్, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ) : అసెంబ్లీ ఎన్నికల్లో కీలక ఘట్టమైన నామినేషన్ల ఉప సంహరణ ప్రక్రియ బుధవారంతో ముగిసింది. మెదక్ జిల్లాలో రెండు నియోజకవర్గాలకు మొత్తం 34 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో మెదక్ నియోజకవర్గం నుంచి 18 మంది, నర్సాపూర్ నియోజకవర్గం నుంచి 16 మంది నామినేషన్లు వేశారు. సోమవారం జరిగిన నామినేషన్ల పరిశీలనలో మెదక్ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థి రంగాగౌడ్ నామినేషన్‌ను అధికారులు తిరస్కరించారు. దీంతో మెదక్‌లో 17 నామినేషన్లు మిగిలాయి. నర్సాపూర్ నియోజకవర్గంలో మొత్తం 16 నామినేషన్లకు అన్నింటినీ ఆమోదించారు. ప్రస్తుతం రెండు నియోజకవర్గాల్లో 33 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా, బుధవారం మెదక్ నియోజకవర్గంలో నలుగురు ఉప సంహరించుకున్నారు. 13 మంది బరిలో నిలిచారు. నర్సాపూర్ నియోజకవర్గంలో ఐదుగురు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉప సంహరించుకున్నారు. దీంతో 11 మంది బరిలో ఉన్నారు. మెదక్ నియోజకవర్గంలో 13 మందిలో ఎం.పద్మాదేవేందర్‌రెడ్డి(బీఆర్ఎస్), మైనంపల్లి రోహిత్(కాంగ్రెస్), పంజా విజయ్‌కుమార్(బీజేపీ), అంసాన్‌పల్లి లక్ష్మీ(బీఎస్పీ)తో పాటు మరో 8 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. నర్సాపూర్ నియోజకవర్గంలో 11 మందిలో వాకిటి సునీతారెడ్డి(బీఆర్ఎస్), ఆవుల రాజిరెడ్డి(కాంగ్రెస్), మురళీధర్‌యాదవ్ (బీజేపీ)తోపాటు 8 మంది బరిలో నిలిచారు.

## ఎన్నికల్లో చెక్‌పోస్టుల పాత్ర కీలకం



నర్సాపూర్ చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ రిజిస్టర్ చెక్‌చేస్తున్న సంతోష్‌కుమార్ తుకారాం

- అక్రమ మద్యం, డబ్బు రాకుండా చూడాలి
- జిల్లా పోలీస్ పరిశీలకుడు సంతోష్‌కుమార్ తుకారాం

మెదక్ అర్బన్, నవంబర్15: ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు చెక్‌పోస్టులు కీలక పాత్ర వహిస్తాయని జిల్లా పోలీస్ పరిశీలకుడు సంతోష్ కుమార్ తుకారాం అన్నారు. బుధవారం నర్సాపూర్ చెక్‌పోస్టును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాకు అక్రమ మద్యం, డబ్బు, ఇతర వస్తువులు రానీయకుండా పకడ్బందీగా చెక్‌పోస్టులు నిర్వహించాలని పేర్కొన్నారు. జిల్లాలోని ఏడు చెక్ పోస్టుల్లో జిల్లా సిబ్బంది, సాయుధ బలగాలతో కూడిన పహారాను పకడ్బందీగా 27/7 నిర్వహిస్తున్నామన్నారు. అక్రమ మార్గంలో ఎటువంటి మద్యం, డబ్బు, ప్రజలను ప్రలోభ పెట్టే వస్తువులను జిల్లాకు రాకుండా చూడాలని సిబ్బందికి ఆదేశించారు. అనంతరం వాహన తనిఖీలు చేసిన వాహన రిజిస్టర్‌ను పరిశీలించారు. దీంతోపాటు ప్రత్యక్షంగా పోలీస్ సిబ్బంది వాహనాల తనిఖీలు చేస్తున్న తీరును క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.

## ఉమ్మడి మెదక్ జిల్లా సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపిక

నర్సాపూర్, నవంబర్ 15: ఉమ్మడి మెదక్ జిల్లా స్కూల్ గేమ్స్, సాఫ్ట్‌బాల్ జట్లను నర్సాపూర్ పట్టణంలోని గిరిజన గురుకుల సాఫ్ట్‌బాల్ అకాడమీ మైదానంలో బుధవారం ఎంపిక చేశారు. ఈ ఎంపికలో ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన సుమారు 60 మంది బాలికలు, 100 మంది బాలురు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి గంగాల రమేశ్ మాట్లాడుతూ పాఠశాల క్రీడా సమాఖ్య మెదక్ జిల్లా ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్కూల్ గేమ్స్ అండర్ 14, అండర్ 17 బాలబాలికల సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు ఆంజనేయులు, చంద్రమోహన్, అశోక్, వ్యాయమ ఉపాధ్యాయులు శ్యామ్‌సుందర్ శర్మ, ప్రదీప్, పూర్ణచందర్, మంజుల, రాజు, రేవంత్, శేఖర్, గిరిజన గురుకుల ప్రాంతీయ క్రీడా కో ఆర్డినేటర్ సుజాత, కోచ్‌లు రేణుక, వెంకటేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఓటర్ స్లిప్పుల పంపిణీ ప్రారంభం



ఓటరు స్లిప్పుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా సాధారణ ఎన్నికల పరిశీలకుడు పృథ్వీ

- జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకుడు పృథ్వీరాజ్

మెదక్ అర్బన్, నవంబర్ 15: ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా పారదర్శకంగా ఓటు వేయాలని, ప్రజాస్వామ్యంలో ఓటు చాలా విలువైనదని జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకుడు పృథ్వీరాజ్ బీపీ అన్నారు. సాధారణ ఎన్నికల్లో భాగంగా మెదక్ నియోజకర్గ పరిధిలోని హవేళీఘనపూర్ మండలం సుల్తాన్‌పూర్ గ్రామంలో ఓటర్ సమాచార స్లిప్పుల పంపిణీని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు అని, ప్రతిఒక్కరూ తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగడానికి ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. సీ విజిల్ యాప్, టోల్ ఫ్రీ నెంబర్ 1950పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ నెల 30న జరిగే పోలింగ్‌లో ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును నిర్భయంగా తప్పనిసరిగా వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో మెదక్ ఆర్ఓ రాజేశ్వర్, ఏఆర్ఓ నారాయణ, బీఎల్ఓలు, ఎన్నికల సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.